# రైతుదీక్ష సక్సెస్

## బీఆర్ఎస్‌లో జోష్

- వేలాదిగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు
- ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేసిన అవినాశ్‌రెడ్డి.. కేటీఆర్ అభినందన



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు పూలతో ఘన స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

రంగారెడ్డి, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : షాబాద్‌లో ఏర్పాటు చేసిన రైతు దీక్షకు అపూర్వ స్పందన లభించింది. దీనికి జిల్లా నలుమూలల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు వేలాదిగా తరలివచ్చారు. హామీల అమల్లో ప్రభుత్వ తీరును ఎండగట్టడం.. భవిష్యత్తులో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టబోయే ఉద్యమాల్లో భాగంగా మొదటిసారిగా రంగారెడ్డి జిల్లా నుంచి ప్రారంభించిన నిరసన దీక్ష సక్సెస్ అయింది. యువ నాయకుడు పట్నం అవినాశ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి ఏర్పాట్లు వాహ్ అనిపించారు. జేసీబీల సహాయంతో కేటీఆర్ ర్యాలీపై పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డిని కేటీఆర్ అభినందించారు.

### తరలివచ్చిన రైతులు

రైతు దీక్షకు జిల్లా నలుమూలల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మహేశ్వరం సెగ్మెంట్ నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో.. చేవెళ్ల సెగ్మెంట్ నుంచి అవినాశ్‌రెడ్డి, కార్తీక్‌రెడ్డి ఆధ్వర్యంలో..ఇబ్రహీంపట్నం సెగ్మెంట్ నుంచి మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, క్యామ మల్లేశ్ ఆధ్వర్యంలో.. షాద్‌నగర్ సెగ్మెంట్ నుంచి మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు భారీగా హాజరయ్యారు. అలాగే, కొడంగల్ సెగ్మెంట్ నుంచి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో.. పరిగి, వికారాబాద్ సెగ్మెంట్ల నుంచి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, ఆనంద్ ఆధ్వర్యంలో భారీగా తరలివచ్చారు.

### జేసీబీలతో పూల వర్షం..

రైతు దీక్షకు హాజరైన కేటీఆర్‌కు ఘనస్వాగతం లభించింది. సుమారు 30 జేసీబీలతో ఆయన ర్యాలీపై పూలవర్షం కురిపించారు. జేసీబీల బొక్కెనలను పైకిలేపి అందులో నుంచి దారి పొడవునా పూలవర్షం కురిసింది. ఈ పూల వర్షాన్ని ..స్వాగత ఏర్పాట్లను చూస్తుంటే తాను నిరసన దీక్షకు హాజరైనట్లు లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంత త్వరగా ఇంటికి పంపించాలో అనే కసి, ఆత్రుత ప్రజల్లో ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తున్నదని కేటీఆర్ పేర్కొన్నారు.

### కొత్త ఉత్సాహం..

షాబాద్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన రైతు దీక్ష జిల్లా పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. దీక్షకు హాజరైన మాజీ మంత్రులు సబితాఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఇతర మాజీ ఎమ్మెల్యేలు చేసిన ప్రసంగం రైతులు, బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త జోష్‌ను తీసుకొచ్చింది. ఈ సందర్భంగా రైతు దీక్షకు హాజరైన పలువురు రైతులతో కేటీఆర్ ముఖాముఖి మాట్లాడారు. రుణమాఫీ, రైతుభరోసా, మహిళలకు రూ. 2500 ఆర్థిక సాయం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500లకు సిలిండర్ వంటి పథకాలు ఎక్కడా అమలు కావడంలేదని, కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిందని పలువురు కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. హామీలను అమలు చేయాలని కోరితే అక్రమంగా జైళ్లలో నిర్బంధిస్తున్నారని మండిపడ్డారు.

### ఓట్ల కోసం వచ్చే నాయకులను నిలదీయండి

అలవి కాని హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం గ్రామాల్లోకి వస్తే నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. త్వరలోనే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలు రానున్నాయని.. ఈ ఎన్నికల్లో ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్ నాయకులకు హామీలు అమలు చేసిన తర్వాతే తమ వద్దకు రావాలని స్పష్టంగా చెప్పాలని సూచించారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరుతున్న బీజేపీ నాయకుడు గోనె కరుణాకర్‌రెడ్డి తదితరులు

## బీఆర్ఎస్‌లో భారీగా చేరిక

చేవెళ్ల రూరల్, జనవరి 17 : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా ఆరు గ్యారెంటీల అమలు ఎప్పుడని సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. మండలంలోని ముడిమ్యాల్ గ్రామానికి చెందిన 200 కాంగ్రెస్, బీజేపీ నాయకులు స్థానిక బీజేపీ నాయకుడు గోనె కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరగా వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ముడిమ్యాల్ గేట్ వద్ద బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతూ.. రైతుబంధు, రైతుబీమా, రూ. లక్ష, తులం బంగారం, రూ.4 వేల పింఛన్ వంటి పథకాలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైందన్నారు. రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా.. ఇచ్చిన హామీలను అమలు చేసే వరకూ ప్రజలు, రైతుల తరఫున పోరాడుతూనే ఉంటామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ముడిమ్యాల్ గ్రామానికి చెందిన కిష్టయ్య అనే వ్యక్తి రేవంత్ సర్కారు చెప్పేవి అన్నీ అబద్ధాలే అని నినదించాడు. అంతలోనే కేటీఆర్.. కిష్టయ్య ఊరుకో లేదంటే రేవంత్‌రెడ్డి జైల్లో వేస్తారని నవ్వులు పూయించారు. కేటీఆర్ వెంట మాజీ మంత్రులు సబితారెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి ఉన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో నరేందర్‌రెడ్డి, రాంరెడ్డి, దినేశ్‌రెడ్డి, రాఘువేందర్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి, శివకుమార్, జంగయ్య, ఎర్రవల్లి, ప్రభాకర్, లక్ష్మయ్య, శేఖరప్ప, రాములు, సుధాకర్, జంగయ్య, సూరి, రమేశ్, రాములు, సత్తయ్య, శ్రీను, మహేందర్, కృష్ణ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాజు, మహేందర్, నందు, చిన్నా, బాల్‌రాజ్, మండల యూత్ అధ్యక్షుడు శేఖర్, మాజీ సర్పంచ్‌లు హన్మంత్‌రెడ్డి, సులోచనాఅంజన్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, వ్యసాయయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, నాయకులు సత్యం, వీరాంజనేయులు, నవీన్, వీరస్వామి, మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతు దీక్షకు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, రైతులు, మహిళలు, బీఆర్ఎస్ శ్రేణులు



## మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగాలి

### మొయినాబాద్‌లో మాజీ మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం

మొయినాబాద్ : పార్టీ అధికారంలో ఉన్నా.. లేకున్నా మొక్కవోని ధైర్యంతో ప్రతి కార్యకర్త ఉండాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శుక్రవారం షాబాద్‌లో నిర్వహించిన రైతుదీక్ష కార్యక్రమానికి మాజీ మంత్రులు సబితారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, శంభీపూర్ రాజుతో కలిసి మాజీ మంత్రి కేటీఆర్ వెళ్తుండగా.. మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణు లు వారికి ఘన స్వాగతం పలికారు. కేటీఆర్ మండల కేంద్రానికి రాగానే జై తెలంగాణ, జై కేసీఆర్, జై కేటీఆర్ అనే నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా కేటీఆర్‌కు పార్టీ శ్రేణులు శాలువాలు కప్పి.. పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. పటాకులు కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించడంతోపాటు తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి కేటీఆర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నేతలు, నాయకులతో మాట్లాడుతూ.. ఇంత అభిమానాన్ని చూపిన మీకు ప్రత్యేక అభినందనలన్నీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో నిలబడితే రానున్న రోజుల్లో మనదే రాజ్యం అని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి, జయవంత్, వెంకట్‌రెడ్డి, గణేశ్‌రెడ్డి, నర్సింహాగౌడ్, రాము, జగన్‌మోహన్‌రెడ్డి, చైర్మన్లు వెంకట్‌రెడ్డి, రవూఫ్, రాజు, సుధాకర్‌యాదవ్, రాఘవరెడ్డి, మహేందర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రవియాదవ్, సురేందర్‌గౌడ్, అంజిరెడ్డి, షేక్ మహబూబ్, అంజయ్యగౌడ్, రాంచందర్, తిరుపతిరెడ్డి, బాల్‌రాజ్, ప్రవీణ్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, చిన్న, పరమేశ్, ప్రవీణ్, బాలు, అరవింద్, వెంకటేశ్, దేవిడ్, కిరణ్, సునీల్, భాస్కర్, ఓంప్రకాశ్‌గౌడ్, శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, మల్లేశ్, దర్శన్, శ్రీరాములు, షరీఫ్ పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించి.. శ్రేణులకు అభివాదం చేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

### సాగుకు యోగ్యంకాని
## భూములను గుర్తించాలి

- రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్
- యాచారంలో రైతు భరోసా అమలుపై సమీక్ష



యాచారం రైతువేదికలో రికార్డులను పరిశీలిస్తున్న రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

యాచారం, జనవరి 17 : సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించాలని రంగారెడ్డి అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో రైతు భరోసా పథకం అమలుపై అధికారులతో కలిసి ఆమె చర్చించారు. మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన విలేజ్ మ్యాపులను ఇబ్రహీంపట్నం ఆర్డీవోతో కలిసి ఆమె పరిశీలించారు. మండలంలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించిన రికార్డులు, ఇప్పటివరకు అధికారులు నిర్వహించిన నాలుగు గ్రామాల సర్వేను ఆమె పరిశీలించారు.

సర్వేలో ఎలాంటి లోటుపాట్లు ఉండొద్దని అధికారులకు సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు కలిసి సమన్వయంతో సాగుకు యోగ్యంకాని భూముల జాబితాను రూపొందించాలన్నారు. ముఖ్యంగా గ్రామ కంఠంలో ఉన్న భూములు, సాగుకు యోగ్యతలేని భూములు, రియల్ ఎస్టేట్‌కు (లే-అవుట్లు, వెంచర్లు, ప్లాట్లు)సంబంధించినవి శిఖం భూములు, గుట్టలు, కొండలు, రోడ్లు, మైనింగ్, ప్రభుత్వ భూములు, ఫామ్‌హౌస్‌లు తదితర వ్యవసాయేతర భూములను పక్కాగా గుర్తించాలన్నారు. రైతుభరోసా లబ్ధిదారుల ఎంపికలోనూ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూములను గుర్తించి గ్రామ సభల ద్వారా ప్రజలు, రైతులకు వివరించాలన్నారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో అన్ని గ్రామాల్లో సభలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఏడీఏ సుజాత, మండల వ్యవసాయాధికారి రవినాథ్, డీటీ కీర్తిసాగర్, ఆర్ఐలు రామకృష్ణ, మురళీకృష్ణ, ఏఈవో వసంత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలి



మాట్లాడుతున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- పంచాయతీరాజ్, రోడ్డు భవనాల శాఖల అధికారులతో సమీక్ష

కొడంగల్, జనవరి 17 : నియోజకవర్గ పరిధిలోని పంచాయతీరాజ్, రోడ్డు భవనాల శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న రోడ్డు పనులను నాణ్యతతో చేపట్టాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కడా కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్లు నిర్మించే క్రమంలో సంబంధిత శాఖల ఇంజినీర్లు ఉమ్మడి తనిఖీలు నిర్వహించి అంచనాలు రూపొందించాలని.. నీటి సరఫరా పైప్‌లైన్, విద్యుత్ స్తంభాల మార్పిడి వంటి వాటికి అయ్యే ఖర్చులకు నివేదికలను రూపొందించి.. పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అడవుల్లో రోడ్డు వేసే క్రమంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో సంప్రదించి సమన్వయంతో పనులను పూర్తి చేయాలన్నారు. ఇప్పటి వరకు కడా పరిధిలో మంజూరైన అభివృద్ధి పనుల పురోగతిని ఆయన అడిగి తెలుసుకున్నారు.

సమావేశంలో తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ వసంత్‌నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఈ నీలావతి, సంజీవ్‌రెడ్డి, ఇంజినీరింగ్ విభాగం డీఈ, ఈఈలు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో ఆరోగ్యంగా ఉంటాం

క్రీడలతో శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటామని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ ఏదో ఒక క్రీడలో సాధన చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ హనుమంత్‌రావు, డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ఏఆర్‌డీఎస్పీ వీరేశ్, సిబ్బంది పాల్గొన్నారు. –వికారాబాద్, జనవరి 17



ఎబ్బనూరులో రేషన్ కార్డుల సర్వే జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్

## సర్వేలో తప్పులుండొద్దు..

ధారూరు, జనవరి 17 : గ్రామాల్లో రేషన్ కార్డు, వ్యవసాయ భూముల సర్వేను తప్పుల్లేకుండా జాగ్రత్తగా చేపట్టాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మండలంలోని ఎబ్బనూరు గ్రామంలో చేపట్టిన రేషన్ కా ర్డు సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ, భీడు భూము లపై ఆరా తీశారు. ఆయన వెంట వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, ధారూరు తహసీల్దార్ షాజిదాబేగం, డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ ఉన్నారు.



## సర్వే పక్కాగా ఉండాలి

సర్వేను క్షేత్రస్థాయిలో పక్కాగా చేపట్టి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలో పర్యటించారు. యాచారం, చింతపట్ల గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఎంపీడీవో నరేందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక పకడ్బందీగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీలత, ఈసీ శివశంకర్‌రెడ్డి, పంచాయతీకార్యదర్శి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు. -యాచారం, జనవరి 17



## వ్యవసాయ భూములపై ఆరా తీసి..

రైతు భరోసా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నరసింహరావు అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని చేవెళ్ల డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ సురేశ్‌బాబుతో కలిసి సందర్శించి వ్యవసాయేతర భూముల వివరాలను చేవెళ్ల తహసీల్దార్ కిష్టయ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో చేవెళ్ల ఆర్ఐ పవన్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. -చేవెళ్లటౌన్, జనవరి 17



## సాగు భూములనే పరిగణనలోకి తీసుకోవాలి

మండలం, మున్సిపల్ పరిధిలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు, రైతు భరోసా సర్వే ముమ్మరంగా సాగుతున్నది. కాగా శుక్రవారం తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. రైతుభరోసాకు సాగు భూములను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. -కొడంగల్, జనవరి 17